క్లుప్తంగా

టెన్త్ పరీక్షలకు సిద్ధం



ఎంఈఓ వెంకటయ్య

దౌల్తాబాద్: ఈ నెల 18నుంచి 30వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. మండల కేంద్రంలో జెడ్పీ ఉన్నత పాఠశాల, సీపీఎస్ పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటిల్లో 387 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్ ఎక్కడైనా పోగొట్టుకున్న నేపథ్యంలో.. వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9.30 గంటల లోపు కేంద్రాలకు చేరుకోవాలని, మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడితే.. తర్వాత పరీక్షకు అనుమతి ఉండదని వెల్లడించారు.

ఘనంగా గీతాయజ్ఞం



యజ్ఞంలో తైలం పోయిస్తున్న ఆధ్యాత్మిక వేత్త

ధారూరు: శ్రీహనుమాన్ దేవాలయంలో గురువారం గీతాయజ్ఞం ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వేత్త పలువురు దంపతులతో గీతా యజ్ఞం చేయించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ మాజీ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గీతాపారాయణం, విష్ణు సహస్రనామం, హనుమాన్ చాలీసాను పఠించాలని సూచించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు



బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ధారూరు: మండల పరిధి తరిగోపుల ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మైలారం, మోమిన్‌కలాన్, నాగ్‌సాన్‌పల్లి, తరిగోపుల, రాజాపూర్, మోమిన్‌ఖుర్దు గ్రామాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రాజాపూర్ పాఠశాల విజేతగా నిలిచింది. విజేతలకు హెచ్‌ఎం శివకుమార్ ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా శిక్షణ ఫౌండేషన్ సభ్యులు రాములు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో తోడ్పడతాయన్నారు. ఇందులో హెచ్‌ఎంలు శ్రీనివాస్, కవిత, సంతోష్‌కుమార్, ప్రభు, శ్రీశైలం, అస్మా సుల్తానలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలి

చేవెళ్ల: మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందాలని భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి షైమూదా అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని సీపీఐ కాలనీ ఫేజ్–2 వద్ద గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వడ్ల మంజుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె ముందుగా జెండా ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జనాభాలో సగభాగమైన మహిళలకు పురుషులతో సమాన హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ లేకుండా పోతున్నాయన్నారు. మహిళల రక్షణకు ఎన్ని చట్టాలు వచ్చినా నేటికీ సమాజంలో మహిళలకు గౌరవం దక్కకపోగా లైంగిక వేధింపులు, వరకట్నం చావులు ఆగటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలందరూ చైతన్యవంతులు కావాలని, సమస్యలను ధైర్యంగా ఎదుర్కునేలా తయారు కావాలన్నారు. జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, మండల కార్యవర్గ సభ్యులు లలిత, అనురాధ, యాదమ్మ, జయమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. రామస్వామి, ఏఐటీయూసీ నాయకులు సత్యనారాయణ, నాయకులు సుభాన్‌రెడ్డి ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకా తప్పనిసరి



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ స్రవంతిలు పేర్కొన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని కొమరబండ, చందనవెల్లి గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ టీకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా ఉండాలంటే గాలికుంటు టీకాలు తప్పకుండా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

చెత్త కదలదు.. మురుగు పారదు
- దోమలతో జనం బేజారు
- డంపింగ్ యార్డులను తలపిస్తున్న ఖాళీ స్థలాలు
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- పట్టించుకోని మున్సిపల్ యంత్రాంగం



పరిగి: వేంకటేశ్వరస్వామి దేవాలయం పక్కన ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు



తాండూరు: ఇందిరాచౌక్ వద్ద మురుగు కాల్వలో పేరుకు పోయిన చెత్త

తాండూరు: మున్సిపాలిటీ అపరిశుభ్రతతో అస్తవ్యస్తంగా తయారయింది. చెత్తాచెదారం పేరుకుపోయి ఈగలు, దోమలకు నిలయంగా మారింది. మురుగు కాలువలు ఉన్నా.. అవి ముందుకు సాగక దుర్వాసన వెదజల్లుతోంది. ఫలితంగా ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఏటేటా పట్టణ ప్రాంతం విస్తరిస్తున్నప్పటికీ.. అందుకు తగిన సౌకర్యాలు కల్పించడం, పారిశుద్ధ నిర్వహణలో మున్సిపల్ యంత్రాంగం పూర్తిగా విఫలం అయింది.

ఇతర పనుల్లో కార్మికులు

మున్సిపాలిటీలో మొత్తం 36 వార్డులు ఉండగా.. 14,381 ఆవాసాలు ఉన్నాయి. సుమారు లక్ష మంది వరకు జనాభా నివసిస్తోంది. నిత్యం పుర పరిధిలో 10 టన్నులకు పైగా చెత్త వెలువడుతోంది. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు సుమారు 260 మంది కార్మికులను నియమించారు. ఇందులో పదుల సంఖ్యలో కార్మికులకు ఇతర పనులను అప్పగించారు. ఇళ్లలో నుంచి వచ్చిన మురుగు జలాలు.. మొత్తం చిలుక వాగు ద్వారా ముందుకు ప్రవహించాలి. కానీ ఆ వాగులోకి మురుగు నీటిని అనుసంధానం చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఫలితంగా రైల్వే స్టేషన్ పక్కన రోడ్డులో మురుగు జలాలు పరుగులు తీస్తున్నాయి.

ఖాళీ స్థలాల్లో చెత్త పారబోత

పారిశుద్ధ్య నిర్వహణ లోపంతో పట్టణంలోని ఎన్‌టీఆర్‌కాలనీ, గ్రీన్‌సిటీ, ఆదర్శనగర్, మాణిక్‌నగర్, మల్‌రెడ్డిపల్లి, గొల్ల చెరువు, బస్వణ్ణకట్ట, సాయిపూర్ తదితర ప్రాంతాలు కొట్టుమిట్టాడుతున్నాయి. ప్రధాన రహదారుల పక్కన, 36 వార్డుల్లో చెత్త కుండీలను రెండేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేశారు. కానీ నిర్వహణ లోపంతో అవి ఆరు మాసాలకే ధ్వంసం అయ్యాయి. దీంతో చెత్త మొత్తం రోడ్ల పైనే పారబోస్తున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే మినీ డంపింగ్ యార్డులా తలపించడం గమనార్హం.

ఉక్కిరిబిక్కిరి

ఒక వైపు మండుతున్న ఎండలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతుండగా.. మరోవైపు దోమల బెడద వారిని బెంబేలెత్తిస్తోంది. సాయంత్రం మొదలు తెల్లవార్లు వాటితో జాగారం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. వెంటనే ఫాగింగ్ చేపట్టాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. దోమల నివారణకు ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో నిధులను కేటాయించారు. అయినప్పటికీ.. ఆ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

సమన్వయ లోపం..



పురపాలికలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదు. పలు మార్లు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ప్రస్తావించాను. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలని కోరాము. అయినా.. చర్యలు శూన్యం. దోమల స్వైర విహారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. చైర్‌పర్సన్, అధికారుల మధ్య సమన్వయ లోపమే పనుల్లో తీవ్ర జాప్యం.

– ఆసిఫ్, కౌన్సిలర్, తాండూరు మున్సిపల్

ప్రక్షాళన ప్రారంభం



మున్సిపాలిటీ పరిధిలో కొంత కాలంగా పారిశుద్ధ్య నిర్వహణ లోపం ఉన్న మాట వాస్తవమే. ఆ విభాగంలో ప్రక్షాళన మొదలు పెట్టాం. చెత్త సేకరణతో పాటు మురుగు కాలువల పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాం. ఫాగింగ్ యంత్రాలతో దోమల నివారణకు తక్షణ చర్యలు చేపడతాం. ప్రజారోగ్యానికి పాటుపడతాం.

– విక్రమ్‌సింహారెడ్డి, కమిషనర్, తాండూరు మున్సిపల్

లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుదాం

బంట్వారం: రానున్న పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటుదామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం బంట్వారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పట్నం సునీతారెడ్డి బరిలో ఉంటారని స్పష్టం చేశారు. ప్రజల్లో లేని వ్యక్తులు సైతం సీటు కోసం ఆరాట పడటం విడ్డూరంగా ఉందన్నారు. అలాగే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థిని ఓడించేందుకు డబ్బు సంచులతో తిరిగిన వారు.. ఇప్పుడు కాంగ్రెస్‌లోకి రావాలనుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీలో బీజేపీ, బీఆర్‌ఎస్‌లు కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



సమీక్షలో మాట్లాడుతున్న అధికారులు

కుల్కచర్ల: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఎండలు మండుతున్నాయని, రానున్న రోజులను దృష్టిలో పెట్టుకొని, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధిహామీ పనుల నిర్వహణలో కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపీడీఓ రామకృష్ణ, ఎంపీఓ ఖరీం, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం.. దోమల విహారం

- పట్టణంలో పేరుకు పోతున్న మురుగు

పరిగి: పరిగి పట్టణంలోని ఖాళీ స్థలాలు మురికి కూపాలుగా మారాయి. చెత్త చెదారం, మురుగు నీరు చేరి దుర్వాసన వెదజల్లుతోంది. తద్వారా ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాల్లో కొందరు చెత్త వేయడంతో ఈ దుస్థితి నెలకొందని వాపోతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణలో మున్సిపాలిటీ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం చేస్తున్నారని, పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపించారు.

డ్రైనేజీ అస్తవ్యస్తం

పరిగి పురపాలికలో మొత్తం 15 వార్డులు ఉన్నాయి. పలు కాలనీల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. ఉన్న మురికి కాలువల్లో చెత్తను తొలగించకపోవడంతో మురుగు ముందుకు పారడం లేదు. ఖాళీ స్థలాల్లో చేరి, మురికి కూపాలుగా మారుతున్నాయి. మున్సిపల్ అధికారులు స్పందించి, వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

అండర్ డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు నీరు ఖాళీ ప్లాట్లల్లో చేరుతోందని మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ఈ మేరకు ఎక్కడెక్కడ పనులు చేపట్టాలో గతంలో సర్వే చేయించి ప్రభుత్వానికి నివేదించామన్నారు. నిధులు మంజూరు కాగానే.. సమస్యను పరిష్కరిస్తామని వెల్లడించారు. ఖాళీ స్థలాల్లోని చెత్తను వెంటనే తొలగిస్తామని పేర్కొన్నారు.

నేటి తరానికి మొల్ల జీవితం ఆదర్శం

- అందరికీ అర్థమయ్యేలా రామాయణం రచించిన కవయిత్రి
- సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ ఆఫీసర్ డాక్టర్ శారద



మొల్ల సాహిత్య అవార్డులతో భాషా పండితులు

తాండూరు టౌన్: పండితులకే కాకుండా పామరులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించి, ప్రజలకు అందజేసిన కవయిత్రి మొల్లమాంబ గొప్ప దార్శనికురాలని, ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ ఆఫీసర్ డాక్టర్ శారద తెలిపారు. గురువారం పట్టణంలోని విశ్వవేద పాఠశాల్లో మొల్ల జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రామాయణాన్ని సరళంగా రచించి శ్రీకృష్ణదేవరాయల మన్ననలు పొందిన కవయిత్రి మొల్ల అని చెప్పారు. ఆమె కుమ్మరి(శాలివాహన) కులంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నామని వెల్లడించారు. కవయిత్రి మొల్లను నేటి తరం ఆదర్శంగా తీసుకొని, తెలుగుభాషపై పట్టుసాధించి, పద్యాలు అవలీలగా చెప్పాలని వక్త అంజయ్య సూచించారు. అనంతరం తెలుగుభాష పండితులకు మొల్ల సాహిత్య అవార్డులను అందజేశారు. కవయిత్రి మొల్ల కళావేదిక అధ్యక్షుడు కేవీఎం వెంకట్, ప్రధాన కార్యదర్శి వెంకట్ వంశరాజు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, బాలకృష్ణ, రవీందర్‌గౌడ్, గోవిందరావు, ప్రకాష్, చంద్రశేఖర్, రాజుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పైరవీలకు తావులేదు

- ఇందిరమ్మ ఇళ్లకు నిరుపేదలను ఎంపిక చేస్తాం
- ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు రూరల్: ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియలో పైరవీలకు తావులేకుండా నిరుపేదలను ఎంపిక చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి తాండూరు మండలం గుండ్లమడుగుతండా గ్రామ పంచాయతీ అనుబంధ మైసమ్మతండాలో ఆయన పర్యటించారు. సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. తాండూరు నియోజకవర్గంలో మొదటి విడతలో 3,500 ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నామని వెల్లడించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3 కోట్లు వెచ్చించామని, 90 శాతం పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మైసమ్మతండాకు బస్సు సౌకర్యం కల్పిస్తామని, సేవాలాల్ ఆలయం వద్ద బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, నాయకులు ధారాసింగ్, ఉత్తమ్ చందు, సంపత్‌కుమార్, రవిగౌడ్, రాజ్‌కుమార్, వడ్డె శ్రీను, పురుషోత్తంరెడ్డి, ప్రవీణ్‌గౌడ్, అజ్మాత్, శ్యామప్ప, సంతోష్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే బంగారు భవిష్యత్తు

- విద్యార్థి దశలో పదో తరగతి కీలకం
- మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్

తాండూరు రూరల్: విద్యార్థులు కష్టపడి చదివి బంగారు భవిష్యత్తుకు మార్గం సులభతరం చేసుకోవాలని తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రకాష్‌గౌడ్ అన్నారు. మండలం పరిధి ఐనెల్లి శివారు తెలంగాణ మోడల్ స్కూల్లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు, పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడారు. విద్యార్థికి పదో తరగతి కీలక దశ అని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. కృషి, పట్టుదలతో చదివి, పరీక్షలు బాగా రాయాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నర్సింహులు, ఐనెల్లి మాజీ సర్పంచ్ స్వప్న జ్యోతి, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఉండాలి..

దోమ: పట్టుదలతో పరీక్ష రాయాలని ప్రధానోపాధ్యాయురాలు శ్రీవిద్య విద్యార్థులకు సూచించారు. దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, బాలికల పాఠశాలలో కొవ్వూరి చక్రధర్ రెడ్డి తన సోదరులతో కలిసి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పట్టుదలతో చదువుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రతి పాఠ్యాంశాన్ని శ్రద్ధతో వింటూ, మంచి ఫలితాలను రాబట్టేలా కృషి చేయాలన్నారు. అప్పుడే పాఠశాలకు, తల్లితండ్రులకు పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని పేర్కొన్నారు. ఇందులో జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములు, గ్రామస్తులు రమేశ్‌గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, రాజు, కేఆర్‌ఎం, రబ్బాని, వినయ్ పాల్గొన్నారు.



తాండూరు రూరల్: విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

అధ్వానంగా అంగన్‌వాడీలు

- అద్దె భవనాలు.. అరకొర సౌకర్యాలు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, సిబ్బంది
- 68 సెంటర్లకు.. ఒక్కటే సొంత భవనం
- పట్టించుకోని ఐసీడీఎస్ అధికారులు



శిథిలావస్థ భవనంలో ఊరగుంట అంగన్‌వాడీ కేంద్రం



చిన్నారులతో టీచర్ సావిత్రమ్మ

దౌల్తాబాద్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ అధ్వానంగా కొనసాగుతోంది. అద్దె భవనాలు.. అదీ శిథిలావస్థలో ఉన్న వాటిల్లో ఉండటంతో చిన్నారులు, సిబ్బంది భయంభయంగా కాలం గడుపుతున్నారు. పెచ్చులూడుతున్న కేంద్రాలను చూసి పలువురు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. దీంతో తమ పిల్లలను బడికి పంపించేందుకు తల్లిదండ్రులు అయిష్టత చూపుతున్నారు.

అద్దె రూ.750 చెల్లింపు

మండలంలోని 68 కేంద్రాలకు గాను ఒక్కటి మాత్రమే సొంత భవనం ఉంది. 16 కేంద్రాలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతుండగా.. 51 అద్దె భవనాల్లో కొలువుదీరి ఉన్నాయి. వీటిల్లో మొత్తం 1,039 మంది పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. సర్కారు బడుల్లో కొనసాగుతున్న కేంద్రాల వలన అక్కడి విద్యార్థులకు సరిపడా గదులు లేక.. అసౌకర్యానికి గురవుతున్నట్లు సమాచారం. అద్దె భవనాలకు కిరాయి రూ.750లు మాత్రమే చెల్లిస్తుండటంతో, మౌలిక సదుపాయాలు కలిగిన భవనాలను అంగన్‌వాడీ కేంద్రాలకు ఇవ్వడానికి వాటి యజమానులు ఇష్టపడటం లేదు. తప్పనిసరి కావడంతో అరకొర వసతులు ఉన్న వాటిల్లో కేంద్రాలను నడిపిస్తున్నారు. ఊరగుంటతండా, దేవర్‌ఫసల్‌వాద్, దౌల్తాబాద్, నీటూరు, కొడీడు, గుముడాలలో శిథిలావస్థ భవనాల్లో కొనసాగిస్తున్నారు. ఫలితంగా అయా కేంద్రాలకు తమ చిన్నారుల పంపకుండా.. ప్రైవేటు స్కూల్స్‌కు పంపించేందుకు పెద్దలు మక్కువ చూపుతున్నారు.

ఇబ్బందిగా ఉంది

అద్దె భవనంలోనే అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నాం. ఇరుకుగా ఉండడం, అసౌకర్యాల నడుమ కొనసాగించడం ఇబ్బందిగా ఉంది. వంట, చదువు ఇక్కడే. సౌకర్యాలతో కూడిన సొంత భవనం నిర్మిస్తే బాగుంటుంది. అధికారులు స్పందించి ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– సావిత్రమ్మ, అంగన్‌వాడీ టీచర్, ఊరగుంట

డిగ్రీ కళాశాలలో అన్ని సదుపాయాలతో బోధన

చేవెళ్ల: ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు చేవెళ్లలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో ఉందని, అన్ని సదుపాయాలతో బోధన ఉంటుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంచనలత అన్నారు. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని ఇంటర్ పరీక్షలు ద్వితీయ పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులకు.. గురువారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం కరపత్రాలు పంపిణీ చేశారు. చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, సీట్లు, కళాశాలలో ఉన్న సౌకర్యాలను అందులో పేర్కొంటూ వివరించారు. ప్రశాంతమైన వాతావరణంలో విశాలవంతమైన తరగతి గదుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో విద్యను అందిచనున్నామని వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు దోస్త్ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అనురాధ, రూప, వైష్ణవి, జ్యోతి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పసుమాములలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా కొనసాగుతున్న నిర్మాణాలను గురువారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. సర్వే నంబర్ 386లోని ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిసిన సమాచారం మేరకు తహసీల్దార్ రవిందర్‌దత్తు సిబ్బందిని అక్కడికి పంపించారు. అనంతరం అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో అధికారులు కూలిచ్చివేయించారు. సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, వాటిల్లో నిర్మాణాలు చేపట్టినా, వాటిని కూల్చడంతో పాటు.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాసేవ చేయడం అదృష్టం



కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్

కొడంగల్: పేదలకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని లయన్స్ క్లబ్ ఫౌండర్ మెంబర్, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో 40 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి వైద్యశాలలో శస్త్రచికిత్స కోసం ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. ఉచితంగా ఆపరేషన్లు చేయించి, మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దంత, రక్తదాన శిబిరాలు, ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం, మొక్కలు నాటడం, చెవిటివారికి వినికిడి యంత్రాలు అందజేయడం లాంటి తదితర కార్యక్రమాలతో 35 ఏళ్లుగా సేవలందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో లయన్ సభ్యులు దాసప్ప యాదవ్, ఏన్గుల భాస్కర్, శివకుమార్ గుప్తా, మురహరి వశిష్ఠ, జయతీర్థాచారీ, మునీర్, శ్రీనివాస్‌గౌడ్, సరాఫ్ శ్రీనివాస్, భీంరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

మొయినాబాద్: చిలుకూరు రెవెన్యూలో విలువైన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయని చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, గ్రామస్తులు ఆరోపించారు. గురువారం మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి, గ్రామస్తులు జొన్నాడ రాజు, జకరయ్య, మల్లేశ్ తదితరులతో కలిసి 'సాక్షి' ప్రతినిధితో మాట్లాడారు. చిలుకూరు రెవెన్యూలో ప్రభుత్వ భూములను ఇష్టానుసారంగా కబ్జాలు చేస్తున్నా రెవెన్యూ యంత్రాంగం స్పందించడం లేదని వాపోయారు. గతంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, శాసనకర్తలు సైతం కబ్జాదారులకు సహకరించారని ఆరోపించారు. సర్వే నంబర్ 787లో 22 ఎకరాలు, 632లో 30 ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని తెలిపారు. 166 సర్వే నంబర్‌లో వేదపాఠశాలకు కేటాయించిన భూమిలో 3 ఎకరాలు, 786లో 4 ఎకరాలు, 196లో 2 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందన్నారు. 277, 283 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరిగాయన్నారు. ఉస్మాన్‌సాగర్ చెరువు శిఖంలో అక్రమ నిర్మాణాలు, వరద కాలువలు కబ్జాకు గురయ్యాయన్నారు. మొయినాబాద్ నుంచి చిలుకూరు పెద్ద చెరువులోకి వచ్చే వరద కాలువను పూడ్చేసి, పెపులు వేయడంతో మురుగునీరంతా చెరువులో చేరుతుందని తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని.. అందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. సర్వే నంబర్ 277లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై తహసీల్దార్ గౌతమ్‌కుమార్ కేసులు నమోదు చేయడం శుభపరిణామమని వెల్లడించారు.